## అసెంబ్లీ ముట్టడికి దివ్యాంగుల యత్నం



**అక్షరటుడే, నాంపల్లి :** దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆధ్వర్యంలో నిర్వహించిన అసెంబ్లీ ముట్టడి ఉద్రిక్తతకు దారితీసింది. బషీర్‌బాగ్ నుంచి అసెంబ్లీ వైపు ర్యాలీగా వస్తున్న దివ్యాంగులను గన్‌పార్క్ వద్దే పోలీసులు అడ్డుకున్నారు. ఈ ఆందోళనలో బీజేపీ శాసనసభాపక్ష ఉపనేత పాయల్ శంకర్, ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా తదితరులు పాల్గొన్నారు.


AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

WWW.AKSHARATODAYNEWS.COM


## కుటుంబ పోషణ భారమైంది : ఐబొమ్మ రవి



**అక్షరటుడే, నాంపల్లి :** ఒకప్పుడు విదేశాల్లో విలాసవంతమైన జీవితాన్ని గడిపిన 'ఐబొమ్మ' నిర్వాహకుడు రవి.. ప్రస్తుతం తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కుటుంబ పోషణ కూడా కష్టంగా మారడంతో, తన బ్యాంకు ఖాతాలను అన్‌ఫ్రీజ్ చేయాలని కోరుతూ ఆయన నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అకౌంట్లు అన్నీ మూతపడటంతో నిత్యవసరాలు, కుటుంబ పోషణ,వైద్య ఖర్చుల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నానని ఆయన కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. కనీస జీవన అవసరాల కోసమైనా తన ఫ్రీజ్ అయిన ఖాతాలలో కొన్నింటినైనా తెరిచేలా ఆదేశాలివ్వాలన్నారు.


16-9-2026 (Wednesday) MAIN EDITION


## రేపటి నుంచి భారీ వర్షా లు



అక్షరటుడే, హైదరాబాద్ : రాష్ట్రంలో రేపటి నుంచి భారీ వర్షా లు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. నేడు దక్షిణ, తూర్పు ప్రాంతాలలో తీవ్రమైన వేడి తేమతో కూడిన వాతావరణం ఉంటుంది. గురువారం రాత్రి నుంచి ఉరుములతో కూడిన వర్షా లు పడుతాయి.

## అమెరికాలో కూలిన హెలికాప్టర్




అక్షరటుడే, నేషనల్ డెస్క్ : లాస్ ఏంజిల్స్‌లో ఒక వార్తా సంస్థకు చెందిన హెలికాప్టర్ కూలిపోయింది. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందారు. నగరంలో ఎస్‌యూవీ సిటీ బస్సును ఢీకొంది. ఈ బస్సు ప్రమాదాన్ని న్యూస్ ఛానెల్ సిబ్బంది హెలికాప్టర్ ద్వారా చిత్రీకరిస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది.

## పీఎఫ్ వేతన పరిమితి పెంపు




అక్షరటుడే, నేషనల్ డెస్క్: కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. పీఎఫ్ వేతన పరిమితిని రూ.25 వేలకు పెంచింది. గతంలో రూ.15 వేల సీలింగ్ ఉండగా.. రూ.25 వేలు చేసింది. దీంతో 51 లక్షల మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది. దీని కోసం ఏడాదికి రూ.11,339 కోట్లు కేటాయించనుంది.

## భారత నౌకను ఢీకొన్న పాక్ షిప్



**అక్షరటుడే, ఢిల్లీ :** అంతర్జాతీయ జలాల్లో ఒక పాకిస్తానీ నౌక, ఇండియన్ నేవీకి చెందిన షిప్‌ను ఢీకొంది. దీనిపై భారత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఉత్తర అరేబియా సముద్రంలో సెప్టెంబర్ 15న సాయంత్రం సాధారణ నిఘా విధుల్లో ఉన్న భారత నౌకాదళానికి చెందిన యుద్ధనౌకకు ఒక పాకిస్తానీ నౌక సమీపంగా రావడంతో ఈ ఘటన జరిగింది. దీంతో ఎలాంటి పెద్ద నష్టం జరగలేదని విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. పాకిస్తానీ నౌక అధిక వేగంతో, వృత్తివిరుద్ధంగా, అసురక్షిత పద్ధతిలో విన్యాసాలు చేస్తూ రావడంతో ఈ ప్రమాదం జరిగిందని పేర్కొంది.

## తిరుమల పవిత్రంగా ఉండాలి

**అక్షరటుడే, ఏపీ:** తిరుమల పవిత్రంగా ఉండాలని, రాజకీయాలకు వేదికగా మారకూడదని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆయన తిరుమలలో పర్యటించారు. తాను 1999లో ప్రారంభించిన మ్యూజియాన్ని.. ఇప్పుడు ఆధునికీకరించామన్నారు.

# ‘22ఏ’ సమస్య పరిష్కరిస్తాం

■ బీఆర్ఎస్ హయాంలో భూముల కబ్జా
■ ప్రభుత్వ భూములు రక్షిస్తాం ■ అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి

అసెంబ్లీలో బుధవారం 22ఏ అంశంపై చర్చ జరిగింది. సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. నిషేధిత భూములు, ప్రభుత్వ భూములు , 22A కేటగిరీకి సంబంధించిన అంశాలపై సమగ్రంగా చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. 22A భూముల వల్ల ప్రజల్లో నెలకొన్న ఆందోళనలను తొలగిస్తామని, వాస్తవాలను సభ ముందుంచుతామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాల వల్ల ధరణి వ్యవహారంలో భారీ స్థాయిలో ఆస్తులు కొందరి చేతుల్లోకి వెళ్లాయని ఆరోపించారు. ఈ అంశానికి సంబంధించిన పూర్తి వివరాలు బయటపెడితే రామాయణం అంత ఉంటుందని, చెబితే భారతం అంత పెద్ద కథ అవుతుందని వ్యాఖ్యానించారు. అర్హులకు త్వరలోనే పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు.


### అక్కడే కుట్ర

కేసీఆర్ వచ్చాక మండలస్థాయిలో ఉన్న రికార్డులు కలెక్టరేట్‌కు వెళ్లాయని సీఎం అన్నారు. డిజిటలైజ్ పేరుతో రికార్డులన్నింటినీ కలెక్టరేట్లకు తరలించారని, అక్కడే కుట్ర చేశారని ఆరోపించారు. ఇప్పుడు ఆ రికార్డులు ఉన్నాయో లేవో తెలియదన్నారు. భూదాన్ భూములు కూడా కబ్జా జరిగాయని, వాటిని కూడా బయటపెడతానని తెలిపారు.

### హద్దులు లేవు

నిజాం రాజులు అద్భుతమైన పాలన అందించారని రేవంత్ రెడ్డి అన్నారు. చివరి 10-12 ఏళ్లు వదిలేస్తే మిగితా 200 ఏళ్లు అద్భుతంగా పాలించారని చెప్పారు. 60శాతం భూములకు హద్దులను నిర్ణయించారని, మిగిలిన 40శాతం భూములకు హద్దులు లేవన్నారు. వాటితోనే సమస్య వస్తోందని చెప్పారు. కోటి ఎకరాలు నిషేధిత జాబితాలో ఉన్నాయని ప్రతిపక్ష నేతలు అంటున్నారని సీఎం అన్నారు. 98 లక్షల ఎకరాల భూములు నిషేధిత జాబితాలో ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. అటవీ, అసైన్డ్, దేవాదాయ భూములు నిషేధిత జాబితాలో ఉండాల్సిందేనని, ఇందులో నుంచి ఒక్క ఇంచ్ భూమి కూడా తీయొద్దన్నారు. ప్రైవేట్ వ్యక్తుల 3 లక్షల 77 వేల ఎకరాల భూముల మీదనే పంచాయితీ అన్నారు.

తెలంగాణలో రైతులు, పేద ప్రజలకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పేదలు ఎంతో కష్టపడి సంపాదించుకున్న ఇళ్లు, స్థలాలు ఎలాంటి ఇబ్బందుల్లో పడకుండా వారి సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత తమపై ఉందని అసెంబ్లీ వేదికగా ఆయన తెలిపారు. మరోవైపు, పేదల ఇళ్లను ఉద్దేశపూర్వకంగా కూల్చివేస్తున్నారంటూ కొన్ని రాజకీయ పార్టీలు చేస్తున్న తప్పుడు ప్రచారంపై సభలో చర్చిస్తామని వెల్లడించారు.
- అక్షరటుడే, హైదరాబాద్



### రేవంత్ రెడ్డి ఆగ్రహం..

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై కొందరు ప్రతిపక్ష నాయకులు కావాలనే వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన ముక్కుసూటిగా వ్యవహరించే మనిషి కావడంతోనే కొందరికి నచ్చడం లేదని, ఆయనపై ఒక రాజకీయ భూతాన్ని సృష్టించి తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో తప్పులకు కారణమైన అంశాలపై సభలో నిర్మాణాత్మక చర్చ జరగాలని, వాటిపై ప్రతిపక్షాలు మంచి సూచనలు ఇస్తే పరిష్కరించేందుకు ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని సీఎం స్పష్టం చేశారు.

## అమెరికాకు చైనా కౌంటర్




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ప్రపంచాన్ని శాసిస్తున్న కృత్రిమ మేధస్సు సాంకేతికత విషయంలో అమెరికా, చైనాల మధ్య మళ్లీ మాటల యుద్ధం మొదలైంది. ఏఐ రంగంలో ఏ ఒక్క దేశానికీ గుత్తాధిపత్యం ఉండే ప్రసక్తే లేదని చైనా తేల్చిచెప్పింది. ఏఐ అభివృద్ధిలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు, వివక్ష లేని వాతావరణాన్ని సృష్టించేందుకు అమెరికా తమతో కలిసి పనిచేయాలని చైనా అధికారిక పత్రిక 'పీపుల్స్ డైలీ' హితవు పలికింది. వచ్చే వారం జరగనున్న ఇరు దేశాల ఉన్నత స్థాయి చర్చల నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది.

## విద్యుత్‌ను పొదుపు చేయాలి



**అక్షరటుడే, హైదరాబాద్:** విద్యుత్ ఉత్పత్తిని పెంచడంతో పాటు, విద్యుత్‌ను సమర్థంగా వినియోగించడం, వృథాను అరికట్టడం అత్యంత కీలకమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్‌లో జరుగుతున్న 25వ సీఐఐ ఎనర్జీ ఎఫిషియెన్సీ సమ్మిట్ 2026లో ఆయన ప్రసంగించారు. ఇంధన సామర్థ్యాన్ని కేవలం పర్యావరణ బాధ్యతగా కాకుండా, ఆర్థిక పోటీతత్వాన్ని పెంచే శక్తివంతమైన వ్యూహంగా చూడాలని సూచించారు. మనం కొత్తగా ఉత్పత్తి చేసే విద్యుత్ కంటే, అవసరం లేని సమయంలో వినియోగించకుండా పొదుపు చేసే విద్యుత్ యూనిటే అత్యంత చౌకైనదని ఆయన పేర్కొన్నారు.

## ఓయో రూముల్లో గంజాయి విక్రయం



**అక్షరటుడే, హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలోని కొండాపూర్‌లో ఓయో రూముల్లో గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 17.1 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అస్సాంకు చెందిన ధీరజ్ దాస్ (39), రబాలి అలీ (25) గతంలో నగరంలో సెక్యూరిటీ గార్డులుగా పని చేశారు. అనంతరం గంజాయి దందాలోకి దిగారు. తమ రాష్ట్రం నుంచి అక్రమంగా గంజాయి తీసుకొచ్చి నగరంలో విక్రయాలు చేపడుతున్నారు. ఎవరికి అనుమానం రాకుండా కొండాపూర్‌లోని ఓ హోటల్‌లో ఓయో రూముల కేంద్రంగా దందా చేస్తున్నారు. హోటల్‌పై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి, నిందితులను అరెస్ట్ చేశారు.

## ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టండి



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న ‘భారత్ ఫ్యూచర్ సిటీ’లో పెట్టుబడులు పెట్టేలా సింగపూర్ కంపెనీలను ప్రోత్సహించాలని మంత్రి శ్రీధర్‌బాబు ఆ దేశ ప్రతినిధుల బృందాన్ని కోరారు. సెమీకండక్టర్ రంగంలో సింగపూర్‌కు ఉన్న సాంకేతిక, పారిశ్రామిక అనుభవాన్ని తెలంగాణతో అనుసంధానించాలన్నారు. సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖకు చెందిన ఎనర్జీ అండ్ ట్రేడ్ శాశ్వత కార్యదర్శి ఆగస్టిన్ లీ నేతృత్వంలోని ఆ దేశ ఉన్నతస్థాయి ప్రతినిధుల బృందం బుధవారం సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబుతో సమావేశమైంది.




## సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ప్రారంభం

**అక్షరటుడే, కరీంనగర్ :** కరీంనగర్ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అల్పాహారం అందించడానికి నగరంలోని మార్కెట్ యార్డులో సెంట్రలైజ్‌డ్ కిచెన్ నిర్మించారు. తెలంగాణ ప్రభుత్వం, హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా ఇంప్లిమెంటేషన్ భాగస్వామ్యంతో దీనిని ఏర్పాటు చేశారు. ఈ కిచెన్‌ను బుధవారం మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. అధునాతన సాంకేతిక టెక్నాలజీ తో రూపొందించిన భారీ కిచెన్ ను పరిశీలించారు. ఈ కిచెన్ ద్వారా 17 మండలాల్లోని 669 ప్రభుత్వ పాఠశాలలు, 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని 49,025 మంది విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం అందించనున్నారు.

## రాజీనామా చేయడానికి సిద్ధం : ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

**అక్షరటుడే, హైదరాబాద్ :** ఆర్మూర్ బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నానని అసెంబ్లీలో ప్రకటించారు. బుధవారం శాసనసభలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పట్ల తెలంగాణ ప్రభుత్వం వివక్ష చూపుతోందని ఆరోపించారు. ఆర్మూర్‌లోని శతాబ్దం నాటి పాత తహశీల్దార్ కార్యాలయ భవనానికి బదులుగా కొత్త భవనాన్ని నిర్మించాలని గత రెండేళ్లుగా ప్రభుత్వాన్ని కోరుతున్నప్పటికీ, దీనిపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని ఆయన పేర్కొన్నారు.





## మక్కాపై డ్రోన్ దాడికి యత్నం..

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** సౌదీ అరేబియాలోని పవిత్ర నగరమైన మక్కాపై డ్రోన్ దాడికి హౌతీలు యత్నించారు. ఈ డ్రోన్‌ను సౌదీ విజయవంతంగా అడ్డుకుంది. హౌతీల దాడుల నేపథ్యంలో దేశంలో అలర్ట్ ప్రకటించింది. యెమెన్‌కు చెందిన హౌతీలు మక్కాను లక్ష్యంగా చేసుకున్నారనే ఆరోపణల నేపథ్యంలో సౌదీ మక్కాతో పాటు జెడ్డా, తైఫ్ గవర్నరేట్‌లతో సహా పలు ప్రాంతాలను అప్రమత్తం చేసింది. మక్కాలో వైమానిక ముప్పు హెచ్చరిక జారీ చేయడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. హౌతీలు ప్రయోగించిన డ్రోన్‌ను మక్కాకు దక్షిణాన సౌదీ వైమానిక రక్షణ వ్యవస్థలు ధ్వంసం చేశాయి.

## పాతబస్తీలో అగ్నిప్రమాదం

**అక్షరటుడే, నాంపల్లి :** హైదరాబాద్ పాతబస్తీ వాటర్ ట్యాంక్ రోడ్డులోని రెండంతస్తుల భవనంలో భారీగా మంటలు చెలరేగాయి. సంతోష్ నగర్‌లో గల ఓ రెండు అంతస్తుల భవనంలో మంగళవారం రాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మొదటి అంతస్తులో కిడ్స్ స్కూల్ నిర్వహిస్తున్నారు. స్కూల్‌లో మంటలు చెలరేగి భవనం మొత్తం వ్యాపించాయి. స్థానికులు గమనించి రెండో అంతస్తులో నివాసం ఉంటున్న కుటుంబాలను బయటకు తీసుకొచ్చారు. దీంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు.

